# తమ న్యాయమైన డిమాండ్ లను పరిష్కరించాలి: పోస్ట్ ఆఫీస్ ఉద్యోగులు

**దశ ఓయూ :** నగర వ్యాప్తంగా పోస్ట్ ఆఫీస్ లలో పనిచేస్తున్న పోస్ట్ మెన్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పోస్ట్ మెన్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ అశోక్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్, భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న హైదరాబాద్ హెడ్ క్వార్టర్స్ రీజియన్‌కార్యాలయంముందు పెద్దఎత్తుననిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నిరసన కార్యక్రమానికి నగరవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్ లలో తమకు సరైన మౌలిక సదుపాయాలు లేవని ఆరోపించారు. అన్ని డెలివరీ సెంటర్లలో మౌలిక సదుపాయాలు అయిన త్రాగునీరు, టాయిలెట్, ఉద్యోగులకు కూర్చునే వసతి లేక తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పోస్ట్ ఆఫీస్‌లలోసరిపడా సిబ్బంది లేక తమపైపని ఒత్తిడి తీవ్రంగా పెరిగిందని సిబ్బంది కొరతను వెంటనే భర్తీ చేసి తమపై పని భారాన్ని తగ్గించాలని కోరారు. లీవ్ & ఖాళీ పోస్ట్ మెన్ , ఎంటిఏస్ పోస్టులకు సబ్స్టిట్యూట్ లను వెంటనే నియమించాలన్నారు. ఇప్పటికే పని చేస్తున్న సబ్స్టిట్యూట్లకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. డైరెక్టరేట్ ఆదేశాల ప్రకారం పని సమయాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. పోస్ట్ మెన్, ఎంటీఏస్ లకు సంబంధించిన పెండింగ్






సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆదివారం సెలవు దినం అయినా కూడా తమతో బలవంతంగా ఆదివారం కూడా పని చేయిస్తున్నారని మండిపడ్డారు. అన్యాయమైన పని భారం పెంపు విధానాలను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్ లను పరిష్కరించని నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులతో 1000 మందితో పెద్ద ఎత్తున ఇందిరా పార్క్ వద్ద ఉన్న ధర్నా చౌక్ లో ధర్నా కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీజేసీఏ నాయకులైన ఎం మధుసూదన్ రావు, కృష్ణ, షేక్. లాల్ మియా, మొహమ్మద్, వై ప్రసాద్, శ్రీనివాస చారి, డివిజన్లోని డివిజనల్ ప్రెసిడెంట్లులు, కార్యదర్శులు పెద్దఎత్తున పాల్గొన్నారు.




ప్రపంచ కుష్టువ్యాధీ నిర్మూలన దినోత్సం, మహాత్మాగాంధీ వర్ధంతి సందర్బంగా శుక్రవారం పెద్దఅంబర్ పేట్ చెక్ పోస్ట్ నుండీ గాంధీ విగ్రహం వరకు అవగహన ర్యాలీ నిర్వహించారు. ఏ పి ఏ ఎల్ స్టేట్ కోఆర్డినేటర్ & ఎస్ ఎల్ ఎస్ పి - ప్రెసిడెంట్ మానియాడా రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పి ఎమ్ ఓ సులోచన, ఆశా వర్కర్స్ & లెప్రా సొసైటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ కామేశ్వర్ రావు, శివ్వమ్మ , మాజీ కౌన్సిలర్ విద్యావిజేందర్ రెడ్డి లు పాల్గొన్నారు. -(దశ, పెద్ద అంబర్ పేట).

## కాంగ్రెస్ పార్టీకి మాజీ ఎంపీటీసీ రాజీనామా

❖ కరివిరాల ప్రజలకుఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటా: రణబోతు రమాదేవి రామిరెడ్డి.

**దశ నడిగూడెం :** మండల పరిధిలోని కరివిరాల గ్రామపంచాయతీ మాజీ ఎంపీటీసీ,చెన్నకేశవ స్వామి దేవస్థాన చైర్మన్ రణబోతు రామిరెడ్డి శుక్రవారం రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రమాదేవి రామిరెడ్డి మాట్లాడుతూ తాను ప్రస్తుతం ఏ పార్టీలో చేరడం లేదని భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానని తెలిపారు. తనకు ఇన్ని రోజులుగా మద్దతు ప్రకటించిన గ్రామ ప్రజలకు అభినందన లు తెలియజేశారు.



## వేసవిలో తాగునీటి ఎద్దడి రానీయొద్దు



❖ ఎంపీడీవో శ్రీనివాసరావు సర్పంచులకు దిశానిర్దేశం

**దశ, కారేపల్లి:** రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సింగరేణి ఎంపీడీవో పొన్నూరు శ్రీనివాసరావు అధికారులను, సర్పంచులను ఆదేశించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని గాదెపాడు, ఎర్రబోడు, మాణిక్యారం గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో తాగునీటి వనరులను పరిశీలించిన ఎంపీడీవో, సర్పంచులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేయాలి. తాగునీటిని వృధా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ పర్యటనలో సర్పంచులు భూక్యా రంజిత్ కుమార్, ఈసాల అలివేలు మంగ, నాగేశ్వరావు, భూక్యా పద్మ వాచ్య మరియు ఇతర స్థానిక నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసులకు కౌశిక్ రెడ్డి క్షమాపణలు

**దశ, హైదరాబాద్ :** తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఎవరినీ ఉద్దేశపూర్వకంగా అన్న మాటలు కాదు.. మనోభావాలు దెబ్బతింటే క్షమాపణలు చెబుతున్నాను. సీఎం రేవంత్ రెడ్డి ప్రోద్బలంతో నాపై, నా కుటుంబం పై రాజకీయ కక్షకు తెగబడ్డారు. పోలీసులు, అధికారులు అంటే నాకు ఎంతో గౌరవం ఉంది. కానీ కొందరు.. మేము సమ్మక్క జాతరకు వెళ్తున్న క్రమంలో అడ్డుకొని, తీవ్ర ఒత్తిడికి గురి చేశారు. ఆ ఫ్రస్టేషన్, ఒత్తిడిలో తెలియకుండా నోరు జారాను. అంతే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా అన్న మాటలు కావు. నా మాటలతో ఎవరివైనా మనోభావాలు దెబ్బతింటే వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను. ఈ విషయంలో కొందరు పని కట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని అందరిని వేడుకుంటున్నాను.' అని అభ్యర్థిస్తూ కౌశిక్ రెడ్డి వీడియో విడుదల చేశారు.



### అసలేం జరిగిందంటే..

గురువారం నాడు వీణవంకలోని స్థానిక సమ్మక్క సారలమ్మ జాతరకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లారు. ఆ సమయంలో పోలీసులకు, కౌశిక్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సహనం కోల్పోయిన కౌశిక్ రెడ్డి.. ఐపీఎస్ అధికారిని మతం పేరుతో దూషించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం.. కౌశిక్ రెడ్డి తీరును తీవ్రంగా ఖండించింది. ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని.. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో స్పందించిన కౌశిక్ రెడ్డి.. పోలీసులకు క్షమాపణలు చెబుతూ ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేశారు. తన వ్యాఖ్యల పట్ల వివరణ ఇచ్చారు.

## భక్తులపై పోలీసుల వీరంగం

❖ పోలీసులపై చెప్పులు విసిరిన భక్తులు



**దశ, ములుగు:** మేడారం జాతరలో భక్తులపై పోలీసులు లాఠీలతో విరుచుకుపడ్డారు. సమ్మక్క ప్రధాన ద్వారం వద్ద భక్తులను ఈడ్చుకెళ్లి పిడిగుద్దులు గుద్ది, లాఠీలతో దాడి చేసారు. పోలీసుల దాడిలో పలువురు భక్తులను తీవ్ర గాయాలు అయ్యాయి. దాంతో భక్తులు ఆగ్రహంతో పోలీసులపై చెప్పులు విసిపారు. ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, సీఐ దయాకర్, పోలీసులు వీరంగం సృష్టించారు. పోలీసుల తీరుపై మేడారం సమ్మక్క ఆలయం వద్ద భక్తులు ఆందోళనకు దిగారు.

## 'సీఎం కప్' క్రీడల ప్రారంభం!



**దశ, కారేపల్లి:** కారేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) క్రీడా ప్రాంగణం నేడు క్రీడా ఉత్సాహంతో ఉరకలేసింది. మండల స్థాయి 'సీఎం కప్2026' క్రీడా పోటీలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీఓ పి. శ్రీనివాస్ తహసీల్దార్ ఎమ్మార్వో ఆనంతుల రమేష్ మండల విద్యాధికారి ఎం ఈ ఓ దుగ్గిరాల జయరాజ్ మరియు స్థానిక ఎస్సై బైరు గోపి, సంయుక్తంగా జెండా వందనం ఎగిరవేసి అనంతరం రిబ్బన్ కట్ చేసి అత్యంత వైభవంగా ప్రారంభించారు. విద్యార్థుల మార్చ్ ఫాస్ట్, క్రీడాకారుల నినాదాలతో గ్రౌండ్ అంతా కోలాహలంగా మారింది. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి పలు విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటేందుకు ఉత్సాహంగా సిద్ధమయ్యారు. "క్రీడలు మానసిక ఉల్లాసానికే కాకుండా, శారీరక దృఢత్వానికి మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి తోడ్పడతాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది మరియు క్రీడాభిమానులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

## మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

❖ ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా నిష్పక్షపాతంగా పారదర్శక వాతావరణంలో సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు పూర్తి బాధ్యతతో తమ విధులను నిర్వర్తించాలని మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య సూచించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై ఏఈఓలు, తహసీల్దార్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్, వీడియో వ్యూయింగ్ టీములు (వివీటీ)లతో కలిసి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా కఠిన నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఎన్నికల సమయంలో అక్రమ నగదు, మద్యం, బహుమతులు తదితర ప్రలోభకర అంశాల పంపిణీని అడ్డుకునేందుకు ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాలు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు ప్రచార సామగ్రి ర్యాలీలు సభలు పత్రికా ప్రకటనలు సోషల్ మీడియా ప్రచారం వంటి అన్ని అంశాలపై సమగ్ర అవగాహనతో పర్యవేక్షణ జరగాలని ఆమె స్పష్టం చేశారు. ప్రతి అభ్యర్థి ఖర్చును ఖచ్చితంగా నమోదు చేసి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఖర్చుల ఖాతాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

ఎన్నికల విధుల్లో ఉన్న అన్ని బృందాలు ప్రతిరోజూ నిర్వహించిన తనిఖీలు, స్వాధీనాలు, నమోదైన కేసులు తదితర వివరాలతో కూడిన రోజువారీ నివేదికలను తప్పనిసరిగా సమర్పించాలని చేపట్టిన ప్రతి చర్యను ఖచ్చితంగా నమోదు చేసి స్వాధీనాల వివరాలను అధికారిక రికార్డుల్లో పొందుపరచాలని ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి చిన్న నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎన్నికల నిర్వహణకు నియమిత వివిధ బృందాల సభ్యులు పాల్గొన్నారు.